# కందిరీగలు

"ఏంది, సారూ, మంత్రిగారు రాలేదు? పి.యేకు ఫోను చెయ్య రాదు!"

"అమ్మోవ్! మినిష్టరు కయినా ఫోను చెయ్యొచ్చు గనీ, ఈయ్నకు చేసి బతకలేం? అడి నోరు మురిక్కాలవ! ఆదు చెప్పింది ఇనటవే తప్ప మనమేదయినా అడిగినామా అగ్గి మీద గుగ్గిలమయి పోతాడు. లంచి ఏర్పాట్లు పూర్తయినయ్యా? ఎక్కడా ఏ మాత్రం లోపం రాకూడదు" అన్నాడు తాసీల్దారు.

"మీరు నింపాదిగా ఉండండి, సారూ, నేను చూసుకుంటాగా?" అన్నాడు ప్యూను శీనయ్య.

"డిప్యూటీ కలెక్టరు గారు కూడా వస్తున్నారు, భోజన ఏర్పాట్ల పర్యవేక్షణకు. ఏ లోపం జరిగినా నా పీకట్టుకుంటాడు ఆయన."

"అంతా సక్రమంగా అయి పోతది. నువ్వేం ఫికరు చేయక" అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టరు యాదగిరి.

అది నతవాడి రహదారి బంగ్లా. మినిష్టరుగారు రచ్చబండ కార్యక్రమానికి వస్తున్నారు. ట్రావెలర్స్ బంగ్లాలో భోజనమయాక కాసేపు విశ్రమిస్తారు. సాయంత్రం మూడు గంటలకు కార్యక్రమం మొదలవుతుంది. కనుక సిబ్బంది అంతా హడావుడి పడిపోతున్నారు. 'ఎక్కడ ఏ లోపం వచ్చి, పి.యే. మండి పడిపోతారో' అని భయపడి పోతున్నారు.

అప్పుడు సర్కిల్ ఇన్‌స్పెక్టరు యాదగిరి మొబైల్ మోగింది. ఆయన ఎలర్టయిపోయాడు. ఫోను ఎత్తగానే, అవతలనుండి, "నీకు బుద్ధుందిటయ్యా!" అని అరిచాడు పియే.

కూర్చున్నవాడల్లా ఆయన మోకాలివంక చూసుకున్నాడు. పై అధికారి డి.ఎస్.పి ఆయన్ని "నీ బుర్ర మోకాల్లో ఉందయ్యా!" అనేవాడు. మోకాలు భద్రంగా ఉంది కనుక, బుర్రకూడ సుభద్రమని భావించి, "ఏమయింది, సార్!" అనడిగాడు సర్కిల్ ఇన్‌స్పెక్టరు.

ఆయన అరుస్తూ కూసిన కూతల సారంశమిది. మినిష్టరు గారి కారు నార్కెట్‌పల్లి నుండి సూర్యాపేటకు వస్తున్నది. దంటుపల్లి సమీపంలో, పాపం, పశువయినా, ఓ గేదె హైవే పక్కగానే పోతున్నది. ఎదురుగా లారీ వస్తున్నది. ఓ పెళ్ళి ఊరేగింపుని తప్పించాలన్న ప్రయత్నంలో గేదెకు గుద్దేశాడు మినిష్టరుగారి కారు డ్రైవరు. దానికి ముందు కాళ్ళిరిగాయి. ఆ కుదుపుకు డోరు తెరుచుకుంది. మంత్రిగారు కింద పడిపోయారు. ఆయనకు చిన్న చిన్న దెబ్బలు తగిలాయి. గేదె చేసిన నేరాన్ని గురించి సర్కిలుకు రిపోర్టు చేసి పియ్యేగారు ఫోనులో "కాళ్ళిరిగిన గేదె హైవే పక్కన పడి మూలుగుతున్నది. అదెక్కడికీ పారిపోలేదు. వెంటనే అరెష్టు చెయ్యి" అని అరిచాడు.

ఆ వెంటనే యాదగిరి దంటుపల్లి ఎస్. ఐ నరసింహస్వామికి ఫోను చేసి అరిచాడు, "నీకు బుద్ధుందా?" అనడిగాడు, హుంకరిస్తూ. అందుకు నరసింహ స్వామి పెద్దగా బాధపడలేదు, "ఎట్లున్నా, మంచిగున్నవా?" అన్నట్లు విన్పించాయి ఆ మాటలు.

"ఎమైంది, సారూ?" అనడిగాడు.

యాదగిరి విషయమంతా చెప్పి, "వెంటనే ఆ గెదెను అరెస్టు చెయ్యి" అని హుకుం జారీ చేశాడు. ఇన్‌స్పెక్టరు నరసింహస్వామికి ఏం చెయ్యాలో తెలియ లేదు. మంత్రిగారి కారు డ్రైవరు తప్పుచేసే అవకాశం ఉండదు కనుక, నేరాలు చేసేది బడుగు జీవులే కనుక, ఆ బడుగు జీవిని లాకప్‌లో పెట్టి కేసు బుక్ చేద్దామంటే గేదెను ఏ సెక్షను క్రింద బుక్ చెయ్యాలో తెలిసి చావ లేదు అతనికి. ఆ మాటే అన్నాడు తన బాస్‌తో.

"అట్లనా?" అని క్షణం తలగోక్కొని, "గీ మాత్రం తెలవదటయ్యా! గొడ్డును అరెస్టు చేసెటందుకు రూల్సు లేవు, దాని ఓనర్ని బుక్ చెయ్యి, ఐపిసి 377 కింద" అని సలహా ఇచ్చాడాయన.

"సెక్షను 377 అన్నాచురల్ అఫెన్సెస్ క్రిందకు వస్తుంది. ఈ కేసు సెక్షను 337 కు సంబంధించిం దనుకుంటా సార్! ద ఏక్ట్ ఆఫ్ నెగ్లిజెన్స్, ఎండేంజరింగ్ హ్యూమన్ లైఫ్."

"సరేనయ్యా, ఏదో ఒకటి కానీ."

అలా వచ్చిన పై అధికారి ఆదేశాలను వెంటనే అమలు పర్చాడు ఇన్‌స్పెక్టరు నరసింహస్వామి. ఆ గేదె ఎవరిదో విచారించాక, పోలీసులు చెప్పాక తన గొడ్డుకు కాలు విరిగిందని తెలుసుకుని ఏడుస్తున్న మల్లేశాన్ని, రెండు తగిలించి పోలీసు స్టేషనుకు తీసుకు వచ్చారు జవానులు.

✢ ✢ ✢

ఇంటరాగేషను పూర్తి చేసి, బావమరది వచ్చాడు కనుక, ఇంటి కెళ్ళి అతనికి మర్యాద చేద్దామనుకుంటున్న ఇన్‌స్పెక్టరు నరసింహస్వామి, బావమరది గురునాథమే తనకోసం స్టేషనుకు రావటంచూసి సంతోష పడిపోయాడు కానీ, తను పొరపడ్డాడని తరువాత అర్థమయింది అతనికి. లాయర్లకు దూరంగా ఉండాలని నరసింహస్వామికి తెలియక పోలేదు కానీ ఆ లాయరు తన బావమరది అవటం వల్ల తప్పలేదు అతనికి.

బావమరదిని మర్యాద చేసి కూచో బెట్టి, ఇంటరాగేషను మొదలెట్టాడు ఇన్‌స్పెక్టరు, "చెప్పు కొడకా, చెప్పు!" అంటూ.

"నాకేం తెలవదు, సారూ!"

"తెలవదంటే అయిపోతదర! ఇయ్యాల నీ తాట వలిచినానే!"

"నేనేం జేస్తి, దొర!"

"గేదె నీ దేనా?"

"అయ్య, బాన్చను. నాదే దొర! తవరి జవాన్లు నాదని చెప్పినారుగా, సారూ?"

"దాన్ని ఇంట్లో కట్టేసుకోవాల్ని గాని బజార్ల వదలి పెడతావుర?" అన్నాడు పోలీసు ఇన్‌స్పెక్టరు నరసింహస్వామి.

"అట్ల వదలి పెట్టి నందుకే గద, నీ కొడుక్కు యాక్సిడెంటయినాది. రోడ్ల పోరగాళ్ళనాదుల్తారె!" అన్నాడు బావమరది గురునాథం.

"నీ చెల్లికి చెప్తనె ఉంటిని. వినకుండె. నేనేం జేయ?"

"అప్పుడు నువ్వుగూడ పనిపాట లేకుండ ఇంట్లనే కూర్చునుంటివని మా చెల్లి చెప్పినాది. దానికంటే ఇంట్ల పనివుంటది. నువ్వేంజేస్తున్నట్టు? ఆడు నీ కొడుకు గాదె? అడిగెటోడు లేదని నీ ఇష్టమొచ్చినట్టు చేస్తవా? నా చెల్లి చెప్తనే ఉంది, నీ సంగతి!"

"నువ్వీడ నుండి ఇంటి కెళ్ళు. ఈడ్ని ఇంటరాగేట్ చేసినాక నేనూ వస్తా. అప్పుడు ఎంక్వైరీ జేస్తా, నీ చెల్లి ఏంజెప్పి నాదో?"

"అదేందో చెయ్యి, నేను బీ జూస్తా."

"చెప్పురా, నువ్వెందుకు దాన్ని హైవే మీద వదిలినావు. పెద్దోళ్ళ కార్లు పోతుంటయ్యని తెలవదు, బే?" గదమాయింయాడు ఇన్‌స్పెక్టరు గేదె యజమాని మల్లేశంను మళ్ళా.

"ఏం జెప్తవయ్య! బండి ఊరులోనకి వచ్చినాది. పెద్దోడి బండయినా, చిన్నోడి బండయినా మెల్లిగనే పోవల్నా? తోవ కనిపించినదని దూసుక పోతరా? నీకొడుకు

ఈదిలోకెళ్ళి నట్టుగనే నా గేదె కూడ ఎళ్ళినాది. అక్కడికి కనిపెట్టుకునే ఉండినా. నాకు చెప్పి ఎళ్తదా, పాడా?" అన్నాడు మల్లేశం.

"ఏందిరోవ్, నా కొడుకు నీ గేదె ఒకటే నంటవా? ఆడు మనిషి, ఇది గొడ్డు" అని గయ్యిమన్నాడు ఇన్‌స్పెక్టరు.

"ఎవళ్ళదయినా పాణమేగందా? దానికి ముందు కాళ్ళిరిగినయ్యంట! దవాకానకు తోలుకెళ్ళాల. ఆ కారోనితో పైస లిప్పించు. అది చచ్చెనా, ఇంకో పాడి గేదె తెచ్చుకోవల్నంటే పాతిక వేలవుతాది."

"ఎవరిదనుకుంటువి, ఆ కారు? మినిష్టరు బాబుది. పైసలంటివా, బొక్కలిరగ్గొడతరు. ముందసలు నువ్వు బయట పడితె కదా?"

"నేనేం జేస్తి? జులుంజేస్తుండవు! నీ కొడుకు కారు కింద పడితే, ఓనరు తాన ఎంత గుంజుకుంటివి?"

"నువ్వు జేసింది గూడ తప్పే, బావ! పిల్లగాడి కాలు జరంత గీరుకుని పోయినాది. అందుకు ట్రీట్‌మెంటని జెప్పి ఆడి తాన రెండు లక్షలు గుంజుతవా? నువ్వు ఇన్‌స్పెక్టరని ఆడు బయపడి పోయిండు. ఓ, పెద్ద రచ్చ చేస్తివి కాదె! అన్నాలపు డబ్బు నిలవదు. మంచిగ బతుకు" అన్నాడు బావమరది గురునాథం కల్పించుకుంటూ.

"ఓర్నీయమ్మ, నువ్వు గమ్మునుండు. నా పనిల దఖలు చేసుకొనొద్దు" అన్నాడు ఇన్‌స్పెక్టరు, మింగాలేక, కక్కాలేక.

గట్టిగా బావమరదిని ఏమన్నా అంటే పెళ్ళానికి కోపమొస్తుంది.

"అరె, న్యాయం చెప్పినా, భయీ? అదీ తప్పే! గొడ్డు కనుక ఆడికి లక్షరూపాలిప్పించు."

మల్లేశం అతని కాల్మొక్కాడు.

"దర్మ దేవతవి దొర, నువ్వు! పది కాలాలపాటు నువ్వు చల్లగుండు."

"నీకేమయినా మతుండెనా? ఈడి గేదె గుద్దిన కారెవరిదనుకుంటివి! మినిష్టరు సాబుది. కారు ముందు బాగం దెబ్బ తిన్నాదంట, అయ్యకు కూడ దెబ్బలు తాకినయ్యంట! అంతా ఈ భోసడికె వల్లనే జరిగినాది. ఈడు గేదెను ఇంట్లో కట్టేసుంటే ఇంత గోసుండేది కాదుగందా? మినిష్టరు సారు పైసలిస్తడా? ఈడితాన గుంజకుంటె నయమె" అన్నాడుఇన్‌స్పెక్టరు, తల గోక్కుంటూ.

"బావా, కారు మనిషిని గుద్దితే, తప్పెవరిదంటావు? మనిషిదా, కారుదా?"

"కారు పాణం లేనిది. డ్రైవరు ఎటు నడిపితే అటు బోతాది. కనుక కారును నడిపే మనిషిదే తప్పుగానీ, కారుది కాదు."

"మరి పశువు కారును గుద్దినా, కారు పశువును గుద్దినా తప్పెవరిదంటావు, కారుదా, పశువుదా, డ్రైవరుదా?"

"కారు పాణం లేనిదని చెప్పాను. కనుక కారు తప్పుండదు. పశువుకు బుర్రుండదు. కనుక దానిదీ తప్పుకాదు. తప్పుచెయ్యవల్నంటే బుర్రుండాలని మా పోలీసు మాన్యువల్‌లో చెప్పినారు. పిచ్చోడు తప్పుచేసినా, ఆడికి బుర్రుండదు కనుక ఆడ్ని పిచ్చోళ్ళ దవాఖానాకుపంపుతరు గానీ జెయిల్లో పెట్టరు" అని వివరించాడు ఇన్‌స్పెక్టరు నరసింహస్వామి ఓపిగ్గా.

"అంటే కారు, పశువు ఒకటే నంటవు! ఏం జరిగిన ఆటి తప్పులేదంటవు!"

"అంతే గందా మరి?"

"కారు పొరపాట్న దొర్లి పడి ఏక్సిడెంటు చేసినాదనుకో. డ్రైవరు కారులో లేడు కనుక ఎవరిది తప్పంటావు?"

"పొరపాట్న ఎట్లా దొర్లుతది? బుర్రుండే చెప్తున్నవా?

"గేదె దాన్ని గుద్దినాదనుకోరాదె! కార్ల డ్రైవరు లేడు, గేదె యజమాని కూడ ఆడ లేకుండె. కారొచ్చి తోవనపోయే మనిషి మీద పడి ఏక్సిడెంటు చేసినాది. తప్పెవరిదంటావు?"

ఇన్‌స్పెక్టరు నరసింహ స్వామి తల గోక్కున్నాడు. అతనికి చిరాకెత్తు కొచ్చింది. లాయర్లు అలా తికమక పెట్టి వాదనలు సాగిస్తారు కనుకే కేసులు గెలుస్తారని అతని అభిప్రాయం.

"నీయమ్మ, నీగోలేంది, నువ్వింటి కెళ్ళు" అన్నాడు కోపంగా.

"నేనెళ్ళ! నీ సంగతేందో పూర్తిగా చూసిందాకా ఎళ్ళనంటే ఎళ్ళ! ఆన్సర్ మై కొశ్చన్!"

రాజూ, మంత్రీ, మొండివాడూ, బావమరదీ బలవంతులని చిన్నప్పుడు చదువుకున్న ఇన్‌స్పెక్టరు నరసింహస్వామి ఇంకేం మాట్లాడలేదు.

"పోనీ ఇది చెప్పు. ఆ రెంటి ఎనక మనుషులుంటే ఇద్దర్లో ఎవరో ఒకళ్ళు తప్పుచేసినట్టే గందా?"

"అవు మల్ల అంతే గందా?"

"ఇప్పుడీ కేసుల మినిష్టరుదొర కార్ల ఎళుతుండె. డ్రైవరు కారు నడుపుతుండె. ఆదు ఈడి గేదెకు ఢీకొట్టిండు. పశువుది తప్పనలేం గద! కనుక తప్పు డ్రైవరుది. ముందాడ్ని 'రాష్ అండ్ నెగ్లిజెంట్ డ్రైవింగ్' సెక్షను కింద అరెష్టు చెయ్యి."

మంత్రిగారి డ్రైవరును అరెస్టు చేయటమమే! ఇన్‌స్పెక్టరు నరసింహస్వామి గొంతుకు వెలక్కాయ అడ్డంపడి నట్టయింది; తల పట్టుక్కూర్చున్నాడు, ఏంచెయ్యాలో తెలియక.

అలా దిగాలుపడి కూర్చున్న బావమరదిని చూసి జాలేసింది గురునాథానికి.

"నువ్వు భయపడక బావా! అన్యాలం చెయ్యని పోలీసోళ్ళంటే జనం మొక్కుతారు. దేవుఁడు సంతోషిస్తడు. ఆడిని అరెష్టు చెయ్యి" అని సలహా ఇచ్చాడు గురునాథం.

"సిటీ లాయరువు, నీకేం తెలుసు మా మఫసిల్ పోలీసోళ్ళ కష్టాలు! నన్నిట్టా బతకనీ" అన్నాడు నరసింహస్వామి.

దాంతో మల్లేశానికి అర్థమైపోయింది గురునాథం వకీలని. తన పక్షం మాట్లాడుతున్నాడు, తనకు న్యాయం చెయ్య గలడన్న నమ్మకం కుదిరింది.

"అయ్యో, వకీలు బాబూ, అన్యాలపోళ్ళు ఈ పోలీసోళ్ళు! ఈళ్ళ బారి నుండి నన్ను రచ్చించు. బాంచను. కాల్మొక్త" అంటూ అతని కాళ్ళమీద పడిపోయాడు.

దాంతో నరసింహస్వామికి మండిపోయింది.

"బావా! మామ్లా చాల దూరం పోతావుండాది. నువ్వు ఇందులో తల దూర్చకుండా వుంటే మంచిగుంటది. నువ్వు ఇంటి కెళ్ళు. నేను ఈడి సంగతి చూస్కి వస్తా" అన్నాడు.

"అంటే ఏంది? నన్నుకూడ లాకప్‌ల పెడ్తవా? పెట్టు, నీయవ్వ, నీ యవ్వారమేందో తేల్చి పారేస్తా" అని గయ్యిమని లేచాడు గురునాథం.

✣ ✣ ✣

అక్కడ ట్రావెలర్స్ బంగళాలో తాసీల్దారు, ఆయన సిబ్బందీ హడావుడి పడిపోతున్నారు. ఇప్పటికే ఆలస్యమంయింది. మినిష్టరుగారు ఏ క్షణంలో అయినా రావచ్చు. ఎప్పుడొస్తారో ఫోను చేద్దామన్నా భయపడి పోతున్నాడు తహశీల్దారు. డిప్యూటీ కలెక్టరుగారికి ఫోను చేస్తే, ఆయన కూడ ఏం చెప్పలేక పోయాడు.

"నేను వస్తున్నాను. భోజన పదార్థాలవీ వేడిగా ఉండాలి. పియ్యేగారు మండిపడి పోతాడు. జాగ్రత్త"అని ఫోనులో జవాబిచ్చాడాయన.

"ఒరేయ్, శీనయ్యా! ఏందిరా ఆ ఈగ! దాన్ని తోలేయ్! మినిష్టరుగారు చూస్తే మన ఉద్యోగం పోతుంది" అనరిచాడు గమాస్తా రామారావు.

శీనయ్య సాంబారు గిన్నె మీద వాలిన ఈగను తోలాడు కానీ, అది ఈ సారి కూర గిన్ను మీద వాలింది. "దానికి మన పియ్యేగారన్నా బయం లేదయ్యా! బరి తెగించినాది" అన్నాడు శీనయ్య.

"ఒరేయ్ పియ్యేగార్ని ఏమనకరా, ముందు దాన్ని తోలేయ్!" అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టరు.

ఈగ దొరకలేదు. శీనయ్యా, తాసీల్దారూ, సర్కిలూ, అప్పుడే వచ్చిన డెప్యూటీ కలెక్టరూ, అతని డ్రైవరూ, సిబ్బందీ దాన్ని వెంటాడారు కానీ అది ఇంతమందినీ ముప్ప తిప్పలు పెట్టింది.

"ఐ ఎస్ ఐ ఏజెంటో, టెర్రరిస్టు జాతికి చెందిందో అయుండాలి, సారూ!" అన్నాడు సర్కిలు, తాసీల్దారుతో.

"కబ్జాదారుడి బాపతయి ఉంటుంది" అన్నాడు తాసీల్దారు సీతారాం రావు.

ఇంతలో మంత్రిగారి కారు వచ్చింది. అదే సమయంలో నతవాడి సర్కారీ దవాఖానా నుండి డాక్టరు వచ్చాడు, మంత్రి గారి గాయాలకు కట్టుకట్టలానికి. తాసీల్దారు అతన్ని పిలవనంపాడు.

అతన్ని చూడగానే, "గవర్నమెంటు డాక్టరువా? సారు సిటీ కెళ్ళాక ట్రీట్‌మెంటు తీసుకుంటారులే, నువ్వు వెళ్ళు" అన్నాడు మంత్రిగారి పియే..

"భయపడకండి సారు! ఉయ్ ఆర్ క్వాలిఫైడ్ డాక్టర్స్! ఆయనకేం కాదు" అన్నాడు డాక్టరు.

"ఓర్నీయవ్వ! ఆయన ఎవరనుకుంటివి. మినిష్టరుగారు. కామన్ పీపులనుకున్నావా ఏంది, నువ్వు చికిత్స చెయ్యటానికి!"

"భయపడకండి సారూ, ఆయనకేం పెద్దగా దెబ్బలేం తగల్లేదు."

"ఏమయినా సరే, కావల్నంటే డ్రస్సింగ్ చెయ్యి. మందులేం వేసుకోరు సారు."

అంతేకదా? జనసామాన్యానికి చికిత్స అందించే సర్కారీ వైద్యుడు మినిష్టరుకు వైద్యం చేయటమే! అందుకు కార్పొరేట్ ఆసుపత్రులున్నాయి.

"అబ్బ! నువ్వాయన్ని ట్రీట్ చెయ్యనియ్యవయ్యా? అందరికీ ఇచ్చే మందులు మనకి పనికి రావా?" అని మినిష్టరు గారనటంతో పియే ఏమీ మాట్లాడలేక పోయాడు. డాక్టరు మారు మాట్లాడకుండా డ్రస్సింగ్ చేసి, మందులిచ్చి వెళ్ళిపోయాడు.

✣ ✣ ✣

"ఈణ్ణి బొక్కల తొయ్యకపోతే నా నౌకరీ నిల్వదు, నువ్వు గమ్మునుండు, బావా!" అన్నాడు నరసింహస్వామి దీనమయిన మొహం పెట్టి.

"ఆ బి ఎమ్ ఎస్ వాడికి బయపడ్తున్నవా, ఏంది?" అనడిగాడు గురునాథం.

"బి ఎమ్ ఎస్ ఏంది?"

"బాస్ మాలిషింగ్ సర్వీస్! పై నా కొడుకులకు కాకా సట్టటం, జీ హుజూరనటం, కిందోళ్ళను పురుగులను చూసినట్టు చూట్టం ఈ నాయాళ్ళు చేసే పని. అందుకే మా వోళ్ళు ఈళ్ళని బిఎమ్మెసోళ్ళంటారు."

తన బాస్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు యాదగిరి ఆ సర్వీసుకు తగిన మనిషే! పై వాళ్ళ మెప్పుకోసం కింది వాళ్ళని కుట్టికుట్టి చంపే కందిరీగ!

"జె, బావా!" అన్నాడు నరసింహస్వామి.

"అడికి ఫోను చేసి, 'యాక్సిడెంటయిన కారును సీజ్ చెయ్యాల, రూల్స్ ప్రకారం. మా జవాన్ను ఆడకు పంపుతుండా! బండిని ఆడికిచ్చి పంపండి, సారూ! గొడ్డు ఓనర్ని బొక్కలో తోసినా గానీ, కేసు పెట్టాలంటే అఫెన్స్ జరిపిన వస్తువును కూడ మనం కోర్టులో ప్రవేశ పెట్టవల్సి ఉంటుంది, సారూ!' అని చెప్పు. మీ సిఐ దాంతో దంగై పోతాడు" అని ఉపాయం చెప్పాడు గుర్నాథం.

నరసింహస్వామి అట్లాగే ఫోను చేశాడు.

"నీకు దిమాగుంది మాట్లాడుతున్నవా? మినిష్టరుగారి కారు సీజ్ చెయ్యటమా? జరిగే పని కాదు" అన్నాడు సిఐ.

అక్కడే ఉన్న మినిష్టరు, "ఏందయ్యా, విషయం? నా కారు సీజ్ చెయ్యటమెందుకు?" అని అడిగాడు, కల్పించుకుంటూ.

"గేదె ఓనర్ని అరెష్టు చేసినం. కేసు పెట్టాల్నంటే కారు సీజ్ చెయ్యాల్నంటాడు మా ఎస్. ఐ. ఆడికి తెల్సి చావదు, సారూ! నేను మానేజీ చేస్తాగా!" అన్నాడు సి ఐ.

"గేదె ఓనర్ని అరెస్టు చెయ్యమని ఎవరు చెప్పారు?"

"పియే సారు చెప్పుండె కదు, సారూ!"

"కేసక్కర్లేదు, ఏమక్కర్లేదు. అతణ్ణి వదిలెయ్యమని చెప్పు. సరే, గేదె ఎట్లా ఉందో అడుగు."

ఫోనులో చెప్పాడు సి ఐ. "అణ్ణొదిలెయ్! గేదెట్లుందని సారు అడుగుతుండె, ఎట్లుంది?"

"దాని కాళ్ళు ఇరిగినయ్, సారూ! ఇంతకు ముందే చచ్చిపోయిందంట!" చెప్పాడు నరసింహస్వామి.

సి.ఐ మళ్ళా చెప్పిన మాట విన్న మినిష్టరుగారు, "అయ్యో, పావం! ఎంతుంటుందయ్యా గేదె ఖరీదు, వెయ్యి రూపాయలుంటుందా?" అనడిగాడు తాసీల్దారు సీతారాంరావును.

"పది పదిహేను ఉండొచ్చండి!" అన్నాడు ఇదమిత్థంగా అతను. అది వందలూ కావచ్చు, వేలూ కావచ్చు.

"పాపం! ఆ బీదవాడి రుణం మనకొద్దు. ఓ వెయ్యి రూపాయలూ అతడికి పంపు" అన్నాడు కానీ జేబులోనుండి డబ్బు తీసి ఇవ్వలేదు మినిష్టరు. ధరలు ఆకాశానికి అంటుతున్న సంగతి తెలియదు మంత్రిగారికి. ద్రవ్యోల్బణం తగ్గి జనం సుఖశాంతులతో బతుకుతున్నారని ఆయన అభిప్రాయం.

"సారు ఆడికి ఎయ్యి రూపాయలు శాంక్షను చేసిండు. నువ్వాడికి పైసలిచ్చి పంపు. నేన్నీకా పైసలు పంపుతుంటి" అన్నాడు సిఐ.

"అట్టనే" అన్నాడు ఎస్ ఐ.

✣ ✣ ✣

ఎస్. ఐ నరసింహస్వామికి తెల్సు ఆ వెయ్యి రూపాయలూ రావని. కనుక మల్లేశానికి ఆ డబ్బు ఇచ్చే పనే లేదు. అయితే, తన గేదె చచ్చిపోయిన విషయం తెలియని మల్లేశం ఎస్. ఐ నరసింహస్వామి ఫోనులో చెప్పటం విని, బోరున ఏడవటం మొదలెట్టాడు.

"ఓర్నాయనో, పాతిక వేలు చేసే నా గెదెను పొట్టను బెట్టుకునె ఆ మినిష్టరోడు! నా పైసలు నాకిప్పించు" అని ఘోష పెట్టాడు.

"నయం! నిన్ను జెయిలుకు పంపమనుండె మినిష్టరుగారు. దయతలచి నేనే వదలిపెడుతున్నా. వెళ్ళు. పశువుల్ని రోడ్డుమీద వదటకుండా బుద్ధిగా బతుకు" అన్నాడు ఎస్. ఐ నరసింహస్వామి.

"నా పైస నాకిచ్చిందాకా నేనీడనుండి ఎళ్ళను. నేనెట్లా బతకాల?" అన్నాడు మల్లేశం.

"ఈడికి రెండు తగిలించి బయటకు తోలెయ్యండిరా!" అని ఆదేశమిచ్చాడు ఎస్. ఐ నరసింహస్వామి.

"థాంక్స్ బావా! గండం గట్టెక్కించావు!" అన్నాడు నరసింహస్వామి.

"మరి ఊరికే అన్నారా, బావమరది బాగుకోర్తాడని!" అని ఎస్ఐ చెవిలో గుసగుసలాడాడు గుర్నాథం.

జవానులు తమ బాసు ఆదేశం పాటించబోయారు.

"అవున్నిజమే, ఎయ్యండిరా, నాకొడుకుని బొక్కలో" అన్నాడు ఎస్ఐ.

"ఏం జేసిందు, మల్లా?" అడిగాడు గుర్నాథం పైకి.

"రోడ్డు ఆడి బాబు సొత్తా? చచ్చిన గొడ్డును రోడ్డుమీద పడేసి ట్రాఫిక్‌కు అడ్డం కలిగించి నందుకు ఆడిని అరెస్టు చేస్తున్నాను."

నెత్తిన గుద్దేసుకుని లాకప్‌లో ఏడుస్తూ కూర్చున్న మల్లేశాన్ని పిల్చాడు గుర్నాథం.

"నువ్వు అరిచి లొల్లి చెయ్యక! నీకు న్యాయం చేపే పూచీ నాది!"

"దొరో, నువ్వే నన్ను కాపాడాల" అంటూ కాళ్ళమీద పడిపోయాడు మల్లేశం.

లాకప్‌లో అరగంటసేపు మాట్టాడాడు గుర్నాథం అతడితో.

"మరి పాతిక వేల గొడ్డుపోయినా నీకు బాధ లేదా? దిగులు పడకు. ఆ మినిష్టరోడి మీద కేసేద్దాం. చచ్చినట్టు దిగి వస్తాడు, నీ పైసలు నీ కిస్తడు."

"కేసులంటే పైసలేడున్నయ్!"

అయితే, అలా అతన్ని వదలలేదు లాయరు. "నీ గొడ్డు చచ్చింది, అవమానం జరిగింది. తప్పులేకుండానే నిన్ను పోలీసులు కొట్టినారు. ఇది అడవా, ఊరా? ఇంత అన్యాలం జరుగుతుంటే నేను చూస్తూ ఊరుకోలేను. నీ గొడ్డును చంపింది ఆళ్ళు. అన్యాలంగా గొడ్డు రస్తాల పడుందని కేసు పెట్టింది ఆళ్ళు. ఈళ్ళందరి సంగతీ కోర్టుల తేల్చాల. నీ కేసు నేను ఫైట్ చేస్త మగోడన్న తర్వాత పౌరుషం ఉండాల్నా వద్దా?" అని చెవినిల్లు కట్టుకుని చెప్పాడు గురునాథం.

"మరేంజేయాల్నయ్యా, బాన్చను" అని గోల పెట్టాడు మల్లేశం.

"ఇరవై వేలుంటే పనయిపోద్ది. ఈ ఇన్‌స్పెక్టరోడికి తినబెట్టకుంటే ఆడు నిన్ను వదలడు. బయటకొచ్చినాక కేసు పెట్టాలి. అప్పుడు చూడు ఈళ్ళ నందర్నీ ఆట ఆడిస్తా."

"అన్ని పైసలేడివి?" అని బావురు మన్నాడు మల్లేశం.

"నీకు ఇంకో గేదె ఉన్నాదంట గదా? అదమ్మెయ్!"

"నేనేం తిని బతకాల్నయ్య!"

"ఓరియ్యువ్వ, బతకటం సంగతి ఆలోచిస్తుందవు. ఈడ్నుండి బయట పడవల్నా వద్దా? అ నాకొడుకుల తాట తీయవల్నా, వద్దా?"

మల్లేశానికి బుర్రపోయింది. 'అవును, తను లాకప్‌లో నుండి బయట పడ్తే గదా, ఏమయినా చేసెటందుకు!'

ఊళ్ళో కోమటాయన్ని పిల్చారు. మొహమాట పెట్టి అతనిచేత మల్లేశం రెండో గేదెని కొనిపించారు. కోమటాయన నసిగినా, అతనికి తెల్సు, ఆ గేదెకు పాతిక వేలు వస్తుందని. ఐదువేల లాభం అతను వదటుకోలేదు. ఇరవై వేలు లాయరు చేతిలో పడ్డాక, "సూర్యాపేట కొచ్చి నన్ను కలువు, కోర్టులో కేసు వేద్దాం" అని చెప్పాడు.

ఎస్ఐ అతన్ని లాకప్‌లోంచి విడిచి పెట్టాడు. ఇప్పుడు చచ్చిన గొడ్డును రోడ్డు మీద నుండి తొలగించే ఏర్పాటు చేయాలి. 'దానికెంత అడుగుతారో ఆళ్ళు' అని ఆలోచించు కుంటూ నడవసాగాడు మల్లేశం. అందుకు ఏవడి దగ్గర అప్పు చెయ్యాలో కూడ తెలియదు అతనికి. దూరంగా తన మాలక్ష్మి(గేదె) ని తోలుకు పోతున్న కోమటాయన జీతగాడు కన్పించాడు. తను ఎట్లా బతకాలో తెలియని అయోమయంలో అతను ఇంటికి నడచి వెళ్ళాడు. ఎదురుగా శ్రీలక్ష్మి(గేదె) నెమరు వేస్తూ కన్పించింది.

"అదేందే...?" అని నోరు వెళ్ళబెట్టాడు మల్లేశం.

"మా లచ్చిమిని కోమటాయనకు అమ్మినవంట! ఏమొచ్చినాది నీకు?" అనరిచింది మల్లేశం భార్య పోచవ్వ.

"సీలచ్చిమి చచ్చినాది గాదె?"

"రస్తలో చచ్చిన గొడ్డు మన్దనుకుంటివా? మంది కాదు, ఎంకటేసుగానిది!"

"మరి...?"

ఆ 'మరి'కి అర్థం తెలియలేదు మల్లేశం భార్యకు. చచ్చిన గొడ్డు తనది కాకుంటే తను జైలులో ఎందుకున్నట్టు? చావని గొడ్డు ముకద్దమాకు రెండో గొడ్డును ఎందుకు అమ్మినట్టు? అంత అయోమయంలోను తను చచ్చిన గొడ్డు తీసేయటానికి డబ్బు ఖర్చు పెట్టక్కరలేదని తెలిసి సంతోష పడిపోయాడు మల్లేశం.

గోరాశాస్త్రి చెప్పారు, "మానవ ప్రకృతి మూడు రకాలని ఈ మధ్య ఒకమిత్రుడన్నాడు. ఈగ ప్రకృతి: ఈ రకం మనిషి మాలిన్యం ఎక్కడుందో అక్కడ వాలతాడు. కందిరీగ ప్రకృతి: ఈ రకం మనిషి ఉత్తపుణ్యాన ఏమరపాటున ఉన్న మనిషిని కరచి చక్కాపోతాడు. తేనెటీగ ప్రకృతి: ఈ రకం మనిషి తోటి మనిషిలోని మంచినే గ్రహించి ఆస్వాదిస్తాడు." తేనెటీగలు కనుమరుగవుతున్నాయి. మానవ సంబంధాలలో మాధుర్యమే కొరవడింది. ఈగలు, కందిరీగల జాతి పెరిగిపోతోంది. మాలిన్యం, లంచగొండితనం, మితిలేని స్వార్థ విపరీతంగా పెరిగిపోతున్నది. రాజకీయాల్లో, సమాజంలో ఎల్లెడలా విస్తరించింది. ఇంక కందిరీగలు బాధిస్తాయి. ఒకోసారి ప్రాణాలు కూడ తీస్తాయి. అవి ఎవర్ని ఎందుకు కుడతయ్యో మల్లేశానికి తెలియదు. జనాన్ని పట్టించుకోనట్లే ఉంటాయి. కానీ, ఎవర్నో ఒకర్ని కుట్టకుండా అవి బతకలేవని జనసామాన్యానికీ తెలియదు.

కరి సీతారామయ్య స్మృతి సాహితి- నవ్య వీక్లీ ఉగాది కథల పోటీలో విశేష బహుమతి పొందిన కథ- నవ్య వీక్లీ 2-5-2012